క్లుప్తంగా

నేడు డిజిటల్ బుక్ ఆవిష్కరణ

కాకినాడ రూరల్: అన్యాయానికి గురైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా నిలిచేందుకు డిజిటల్ బుక్‌ను ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కాకినాడ రూరల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు ఆదివారం ఆవిష్కరించనున్నారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంప్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని క్యాంప్ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు.

హౌసింగ్ కాలనీలపై నివేదిక ఇవ్వాలి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని హౌసింగ్ కాలనీలను తనిఖీ చేసి సమగ్ర నివేదికలు సమర్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. హౌసింగ్ కాలనీల తనిఖీ పురోగతిపై పంచాయతీరాజ్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల క్షేత్ర స్థాయి ఇంజినీర్లు, ఉపాధి హామీ పథకం సిబ్బందితో కలెక్టరేట్‌లో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. గతంలో ఏర్పాటు చేసిన హౌసింగ్ కాలనీలకు సంబంధించి 300 వర్క్ ఐడీలకు గాను ఇప్పటి వరకూ 189 ఐడీలకు నివేదికలు సమర్పించారని చెప్పారు. మిగిలిన 111 వర్క్ ఐడీలను వచ్చే నెల 7వ తేదీ నాటికి తనిఖీ చేసి, నివేదిక సమర్పించాలని ఆదేశించారు. డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి మాట్లాడుతూ, వర్క్ ఐడీలు సమర్పించాల్సిన 17 మండలాలకు 12 ప్రత్యేక బృందాలను నియమించామని చెప్పారు.

ఆడపిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

బోట్‌క్లబ్: పేదలు, ఆడపిల్లల ఆరోగ్యంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రతాప్‌నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో శనివారం స్వస్థ నారీ– సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ సెంటర్ వైద్యులు వి.అరుణ, జి.లక్ష్మి, ఎండీ అజీజ్ ఆధ్వర్యంలో పలువురికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు.

ఆర్చరీ పోటీల్లో ప్రతిభ



సంజయ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అంజనేయులు

బాలాజీచెరువు: ఆదికవి నన్నయ వర్సిటీ ఆధ్వర్యంలో గొప్పన్నపాలెంలో నిర్వహించిన ఆర్చరీ పోటీల్లో స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ చూపాడు. బీఎస్సీ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎం.సంజయ్ సత్తాచాటి కాంస్య పతకం గెలుచుకున్నాడు. ఈ మేరకు శనివారం కళాశాలలో సంజయ్‌ను ప్రిన్సిపాల్ కందుల ఆంజనేయులు, ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ పసుపులేటి హరిరామప్రసాద్, అధ్యాపకులు అభినందించారు.

ఉపాధి అవకాశాలపై ఓరియంటేషన్

బాలాజీచెరువు: కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఉపాధి అవకాశాలపై శనివారం ఓరియంటేషన్ నిర్వహించారు. డిగ్రీ, బీటెక్, డిప్లమో, పాలిటెక్నిక్, ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణులైన వారు హాజరయ్యారు. మ్యాజిక్ బిలినియన్ ప్రతినిధులు హాజరై జీత భత్యాలు, జర్మనీలో స్థిరపడాలనుకునే అభ్యర్థులకు సలహాలు, సూచనలు అందించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ జీవీకే వర్మతో సమావేశమై బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

దారిదాపుల్లోకి వెళ్లలేం!

- అధ్వానంగా వాకింగ్ ట్రాక్
- పిచ్చిమొక్కలతో 'నడక' యాతన
- బాగు చేయాలంటున్న వాకర్స్



కరపలో వాకింగ్ ట్రాక్ గేటు ముందు పెరిగిన పిచ్చిమొక్కలు

కరప: నడక... ఆరోగ్యానికి ఎంతో అవసరమని వైద్యులు చెబుతుంటారు. అందుకే నడకకు పల్లెల్లోనూ ప్రాధాన్యం ఇస్తుంటారు. అయితే నడక కోసం ఏర్పాటు చేసిన దారులు అధికారుల నిర్లక్ష్యానికి గురవుతున్నాయి.. అవి పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలతో దర్శనమిస్తున్నాయి.. దీనికితోడు విష సర్పాలు తిరుగుతున్నాయి. ఇవి పశుగ్రాస కేంద్రాలుగా మారాయని వాకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ద్వారా పరిశుభ్రతకు అంతా ప్రాధాన్యం ఇవ్వాలని చెబుతున్న అధికారులు ప్రకటనలకే పరిమితమవుతున్నాయని అర్థమవుతోంది. నిత్యం అధికారులు తిరిగే కరప ఎంపీడీఓ కార్యాలయం పక్కనే పరిస్థితి ఇది. కరపలో వాకింగ్ ట్రాక్ నిర్మించాలన్న ప్రజల వినతి మేరకు 2023లో అప్పటి ఎమ్మెల్యే, మాజీ మంత్రి కురసాల కన్నబాబు రూ.1.30 కోట్లు మంజూరు చేశారు. ఇక్కడి సామూహిక రక్షిత మంచినీటి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించి, విద్యుద్దీకరించి, పార్కు నిర్మించాలని తలపెట్టారు. వాకింగ్ ట్రాక్ నిర్మించి, విద్యుద్దీకరణ చేయగా, గతేడాది ఫిబ్రవరిలో మాజీ మంత్రి కన్నబాబు ప్రారంభించారు. వాకర్స్‌కు ఆహ్లాదకరంగా ఉండేందుకు వాకింగ్ ట్రాక్ చుట్టూ పూల మొక్కలు వేయాల్సి ఉంది. అక్కడే వ్యాయామం చేసేందుకు తగిన పరికరాలు కూడా అమర్చాల్సి ఉంది. ఈ లోగా ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. గ్రామస్తులు కోరిన వెంటనే వాకింగ్ ట్రాక్ నిర్మించినందుకు ఆ పార్కుకు కురసాల కన్నబాబు పేరు పెట్టారు. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలైనా ఈ వాకింగ్ ట్రాక్‌ను పట్టించుకోవడం లేదని వాకర్స్ విమర్శిస్తున్నారు. ఇక్కడ నలువైపులా పిచ్చిమొక్కలు పెరిగిపోయి నడవడానికి లేకుండా ఉంది.

అడవిని తలపించేలా..

మంచినీటి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించినా, మండల పరిషత్, గ్రామ పంచాయతీ అధికారులు నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగి అడవిని తలపిస్తోంది. దూరానికి వాకింగ్ ట్రాక్‌లా కనబడుతున్నా, లోపలకు వెళ్తే గడ్డి, పిచ్చి మొక్కలతో పశుగ్రాసం పెంపక కేంద్రంగా దర్శనమిస్తుంది. పాడి రైతులు కొంతమంది వాకింగ్ ట్రాక్‌లోని పిచ్చి మొక్కలను వదిలేసి, పశువులకు పని చేసే గడ్డిని కోసుకుని వెళ్తున్నారు. అధికారులు స్పందించి జాతీయ ఉపాధి హామీ పథకంలో ఈ పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. తద్వారా ట్రాక్ బాగుపడుతుందని, కూలీలకు ఉపాధి దొరుకుతుందని అంటున్నారు.



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి పక్కన వాకింగ్ ట్రాక్‌కు బయట, లోపల అడవిని తలపించేలా పిచ్చిమొక్కలు

యాతన పడుతున్నాం



మంచినీటి చెరువు చుట్టూ ఉండే వాకింగ్ ట్రాక్‌లో పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగిపోవడంతో నడక యాతన పడుతున్నాం. అక్కడ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగి అసౌకర్యంగా ఉంటోంది. నడవడానికి వాకర్స్ ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి ఉపాధి పథకంలోనైనా పిచ్చిమొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.

– చిన్నారి మురళీకృష్ణ, కరప

బాగు చేస్తే.. అందరికీ ప్రయోజనం

ప్రస్తుత ఉరుకులు, పరుగుల జీవనంలో యోగాతో పాటు, నడకకు ప్రాధాన్యం పెరిగింది. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ వాకింగ్ చేయడం అలవాటు చేసుకుంటున్నారు. కరపలో ప్రజలు హైస్కూల్ గ్రౌండ్‌లో నడిచేందుకు వెళ్లేవారు. ఆ గ్రౌండ్ అధ్వానంగా ఉండడంతో అక్కడకు వెళ్లడం తగ్గించేశారు. కొంతమంది కాకినాడ – రామచంద్రపురం రోడ్డు, కరప – కోరుపల్లి రోడ్డుపైనే వాకింగ్ చేసేవారు. మంచినీటి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించడంతో చాలామంది ఉదయం, సాయంత్రం వేళల్లో నడక సాగిస్తున్నారు. అయితే ఈ చెరువు చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి, నడవడానికి అసౌకర్యంగా తయారైంది. విష సర్పాలు కూడా తిరుగుతున్నాయని మహిళలు అంటున్నారు. అధికారులు, పాలకులు స్పందించి పిచ్చిమొక్కలు తొలగించాలని వాకర్స్ కోరుతున్నారు.

పారదర్శకంగా విచారణ నిర్వహించాలి



జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతి పత్రం ఇస్తున్న దళిత సంఘ నాయకులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): గ్రామ పంచాయతీ కార్యదర్శులపై తప్పుడు ఫిర్యాదులు చేయిస్తున్న డీఎల్‌పీఓ కార్యాలయ ఏఓ వెంకటరెడ్డిపై విచారణ జరుగుతున్నందున అతన్ని ఆ స్థానం నుంచి తాత్కాలికంగా పక్కన పెట్టాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కోఆర్డినేటర్ చంగల్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేశారు. విచారణ చేసే సమయంలో అతను అదే స్థానంలో ఉంటే, సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందన్నారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాను కలసి వినతి పత్రం సమర్పించారు. ఏఓ తప్పుడు రిపోర్టుల వల్ల జిల్లాలో 8 మంది దళిత ఉద్యోగులు పదోన్నతి కోల్పోయారని, వీరికి వెంటనే న్యాయం చేయాలని అన్నారు.

జేఎన్‌టీయూకేను సందర్శించిన ఐజీ

బాలాజీచెరువు: జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీని శనివారం ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ సందర్శించారు. అక్టోబర్ 5న జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరీక్ష ఏర్పాట్లపై పరీక్ష కన్వీనర్ వీవీ సుబ్బారావుతో సమావేశమై పరీక్ష విధానం, ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం ఈసీఈ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ బిందుమాధవ్, ఏఎస్పీ దేవరాజ్ పాటిల్, డిప్యూటీ ఎస్పీ సత్యనారాయణ పాల్గొన్నారు.

స్టాంప్ డ్యూటీ సొమ్ము ఇవ్వకపోవడం సిగ్గుచేటు

- కూటమి ప్రభుత్వాన్ని నిలదీసిన సర్పంచ్
- వాడీవేడిగా మండల సమావేశం

కాకినాడ రూరల్: గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఉపయోగపడే స్టాంప్ డ్యూటీ సొమ్మును ప్రభుత్వం ఇవ్వకపోవడం సిగ్గు చేటని వైఎస్సార్ సీపీకి చెందిన తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ దుయ్యబట్టారు. సర్పవరం జంక్షన్ వద్ద మండల పరిషత్ సమావేశ భవనంలో శనివారం ఎంపీపీ అనంతలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు హాజరయ్యారు. 2023 నుంచి స్టాంప్ డ్యూటీ నిధులు పంచాయతీలకు రావడం లేదని, తమ పంచాయతీకి రూ.70 లక్షల వరకూ రావాల్సి ఉందని సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ బురద చల్లారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. గ్రామ పంచాయతీలకు రావాల్సిన స్టాంప్ డ్యూటీ సొమ్ము ఇవ్వకుండా మళ్లించడం సబబేనా అని అడిగారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇళ్ల స్థలాలను పెద్ద ఎత్తున ఇచ్చి జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారని, కూటమి ప్రభుత్వంలో ఇళ్లు నిర్మించుకోని వారిని అధికారులు బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. పునాదుల వద్ద నిలిచిపోయిన నిర్మాణాలకు ఇచ్చిన సొమ్ములు వెనక్కి ఇవ్వాలని, ఖాళీ స్థలాలను రద్దు చేస్తామని భయపెడుతున్నారన్నారు. ఏడాదిన్నర పాలనలో ఇంటి రుణాలు మంజూరు చేయలేదని, తిమ్మాపురం జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో కనీసం మెటీరియల్ వెళ్లే పరిస్థితి లేదన్నారు. కొందరు లబ్ధిదారుల వద్ద సొమ్ము అడుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. గ్రామంలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు తదితర వాటికి వీఆర్వో సహాయకులుగా కొందరు సొమ్ము వసూలు చేస్తున్నారని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నేమాం సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు తమ గ్రామ సమస్యలతో పాటు గ్రామంలో బెల్ట్ షాపుల ఏర్పాటుపై నిలదీశారు. సమావేశంలో ఎంపీడీఓ సతీష్, తహసీల్దార్ కుమారి, హౌసింగ్ ఏఈ నాగభూషణం, వైస్ ఎంపీపీలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిమ్మాపురం సర్పంచ్ సత్యనారాయణ



సమావేశానికి హాజరైన అధికారులు, జెడ్పీటీసీ రామకృష్ణ, ఎంపీపీ అనంతలక్ష్మి తదితరులు

ఆదాయ వనరులు సమకూర్చుకోవాలి

కరప: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గ్రామ సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ శిక్షణలోని అంశాలను ఆకళింపు చేసుకుని సొంత ఆదాయ వనరులు సమకూర్చుకుని గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. ఇళ్ల పన్నుల ద్వారా వచ్చే ఆదాయంతో పాటు, ఏ ఏ మార్గాల ద్వారా పంచాయతీల ఆదాయాలు సమకూర్చుకోవాలన్నది పంచాయతీ పాలకవర్గం, సిబ్బందితో పాటు ప్రజలను భాగస్వాములను చేసి పన్నేతరాదాయాన్ని సమకూర్చుకోవాలన్నారు. రెండో రోజు వినూత్న ప్రాజెక్టుల ఏర్పాటుకు నిధుల సమీకరణ మార్గాలు, గ్రామ పంచాయతీల సుస్థిర వనరుల కల్పనకు ఆదాయ అంచనా, ప్రణాళిక, సొంత ఆదాయ వనరుల సృష్టికి అనుసరించాల్సిన వ్యూహాలు, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనలో ప్రాజెక్టు నిర్వహణ నైపుణ్యాలు అనే అంశాలపై కార్యదర్శులు పీఎస్‌ఆర్ బ్రహ్మానందం, శివరామ్, పి.వీరభద్రరావు, సురేష్ శిక్షణ ఇచ్చారు. ఏఓ బీఎల్ నరసింహం, టి.సుబ్రహ్మణ్యం, ఐవీవీ కార్తీక్, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కరపలో శిక్షణ ఇస్తున్న బ్రహ్మానందం, శివరామ్ పక్కన ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావు

జీఎస్టీ రేట్ల తగ్గింపుపై అవగాహన

కరప: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబ్ రేట్లు తగ్గించి, పేద, మధ్యతరగతి వర్గాలకు మేలు చేసిందని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన స్థానిక పంచాయతీకి వెళ్లారు. అనంతరం సిబ్బందితో కలసి జీఎస్టీ స్లాబ్ రేట్ల గురించి వ్యాపారులు, గ్రామస్తులకు వివరించారు. తగ్గిన జీఎస్టీ రేట్లకే వినియోగదారులకు వస్తువులను విక్రయించాలన్నారు. వినియోగదారులు కూడా నిత్యావసర వస్తువులతో పాటు, ఏ వస్తువు కొనుగోలు చేసినా జీఎస్టీ స్లాబ్ రేట్లు చూసుకుని కొనుగోలు చేస్తే, మోసపోకుండా ఉంటారని ఆయన అన్నారు. గ్రామ కార్యదర్శి యు.నిర్మలాదేవి, పంచాయతీ సిబ్బంది శివరామకృష్ణ, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.



తగ్గిన జీఎస్టీ స్లాబ్ రేట్ల పత్రాన్ని అందజేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావు

పీఆర్‌లో జాతీయ సదస్సు

బాలాజీచెరువు: స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం బోటనీ, మైక్రో బయోలజీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు జరిగింది. మొక్కల ఆధారిత ఔషధాలతో స్థుసిర జీవనం, ప్రపంచ శ్రేయస్సు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కేరళ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డెన్నీస్‌థామస్‌టీ హాజరై ఔషధ మొక్కల ప్రాధాన్యం, ప్రకృతిలో సూక్ష్మజీవుల ఆవశ్యకత వివరించారు. ఏఎన్‌యూ ప్రొఫెసర్ అమృతవల్లి, నన్నయ వర్సిటీ ప్రొఫెసర్ పద్మావతి, సౌత్ అమెరికా ఫ్లోరీస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.కృష్ణమోహన్ హాజరై మొక్కల్లో ఔషధ గుణాల గురించి తెలిపారు. 150 రకాల ఔషధ మొక్కలు ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ కందుల ఆంజనేయులు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పసుపులేటి హరిరామప్రసాద్, వృక్షశాస్త్ర విభాగాధిపతి చికిలే జాన్ శామ్యూల్, మైక్రో బయాలజీ విభాగాధిపతి చీడి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



పీఆర్‌లో సదస్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

అలరించిన నృత్య మహోత్సవం

బోట్‌క్లబ్: నృత్యాంజలి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక గోదావరి కళాక్షేత్రంలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ దసరా నృత్య మహోత్సవం నిర్వహించారు. చిన్నారులు పలు భక్తి గీతాలకు, శాస్త్రీయ సంగీతానికి అనుగుణంగా చేసిన నృత్యాలు నగర ప్రజలను కట్టిపడేశాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన నృత్య కళాకారులు పాల్గొని నృత్యాలు చేశారు. అకాడమీ డైరెక్టర్ హరిగురు శరవణ ఆధ్వర్యంలో శక్తి పురస్కార్ 2025ను కేంద్ర సంగీ నాటక అకాడమీ అవార్డు గ్రహీత వేదాంతం రామలింగశాస్త్రి, వసంత కిరణ్‌లకు అందించారు. అకాడమీ వ్యవస్థాపకులు హరి లోకేష్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



మహోత్సవ్‌లో నృత్యం చేస్తున్న చిన్నారులు

దివ్యాంగులకు పరికరాల పంపిణీ

కాకినాడ రూరల్: వాకలపూడిలోని ఉమా మనోవికాస కేంద్రంలో దివ్యాంగులకు ఐఫ్‌కో – టోకియో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆర్థిక సహకారంతో కృత్రిమ పరికరాలను శనివారం పంపిణీ చేశారు. ఆ కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పీ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పాల్గొని 94 మందికి మూడు చక్రాల సైకిళ్లు, కృత్రిమ కాళ్లు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు తదితర వాటిని పంపిణీ చేశారు. జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు ఏవై శ్రీనివాస్, ఎస్‌వీఎస్‌ఎన్ రెడ్డి, ఉమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జయము జగన్మాతా..

- అమ్మవారి ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- వైభవంగా శరన్నవరాత్ర ఉత్సవాలు

బోట్‌క్లబ్: విజయ రూపిణీ.. శుభకరిణీ.. జయహో అంటూ భక్తులు నీరాజనాలు పలికారు.. ఆ జగన్మాతను మనసారా కొలిచారు.. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా కాకినాడ సిటీతో పాటు రూరల్ నియోజకవర్గాల్లో అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉత్సవాల్లో ఆరో రోజు శనివారం అమ్మవారు వివిధ అలంకరణలో దర్శనమిచ్చారు. కాకినాడ సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో అమ్మవారు జపమాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం వద్ద నాట్యారాధన మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. నృత్యాంజలి స్పిరిట్ ఆఫ్ ఆర్ట్ విద్యార్థుల భరతనాట్యం అలరించింది. స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం జరిగింది. భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు లలితాదేవి అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. అశోక్‌నగర్ సాయిబాబా ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. అమ్మవారికి ఆలయ కమిటీ చైర్మన్ వేదుల అచ్యుతరామారావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. సంతచెరువు కనకదుర్గమ్మ, స్థానిక శారదదేవి ఆలయంతోపాటు నగరంలోని పలు ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు.


కాకినాడ రూరల్: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా కాకినాడ రూరల్ రమణయ్యపేటలోని శ్రీపీఠంలో ఐశ్వర్యాంబిక అమ్మవారు రాజరాజేశ్వరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రమణయ్యపేట ఏపీఎస్పీ వద్ద హ్రీం పీఠంలో లలితా పరమేశ్వరిని ఆవాహనం చేసి మహిళామూర్తులు పూజలు చేశారు.

కరప మండలంలో..

కరప: స్థానిక శివాలయంలో పర్వతవర్ధినీదేవి జపమాల అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాదేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కరప దుర్గాదేవి ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు చేయించుకున్నారు. అర్చకుడు కొంపెల్ల చక్రధర్ పూజాదికాలు నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధినీదేవిని జపమాల అవతారంలో అలంకరించి అర్చకుడు విలపర్తి శ్రీనివాస్ పూజలు చేశారు. ఈఓ కె.తిరుమల రవితేజ, సీహెచ్ శ్రీను ఏర్పాట్లను పర్యవేక్షించారు. కరప చింతపల్లి రోడ్డులోని విజయదుర్గమ్మ ఆలయంలో అర్చకులు కొక్కిరిగడ్డ సుబ్రహ్మణ్యం, మణికంఠలు దుర్గాదేవికి పూజలు నిర్వహించగా, విజయదుర్గా ఆటో యూనియన్, ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు. పెనుగుదురు సంతోషిమాత ఆలయంలో అర్చకుడు కాదా సత్యనారాయణ పూజలు చేశారు. అలాగే మండలంలోని వివిధ ఆలయాల్లో రద్దీ నెలకొంది.



కరప చింతపల్లి రోడ్డులోని విజయదుర్గ ఆలయంలో అమ్మవారు



జపమాల అలంకరణలో సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారు



భానులింగేశ్వర స్వామి ఆలయంలో లలితాదేవిగా..



రిజర్వు పోలీస్ లైన్ అయ్యప్పస్వామి ఆలయంలో కామాక్షి అలంకరణలో..



కాకినాడ శ్రీపీఠంలో ఐశ్వర్యాంబికగా అమ్మవారు



కరప శివాలయంలో జపమాల అవతారంలో పర్వతవర్ధినీదేవి



దేవాలయం వీధిలో అన్నపూర్ణాదేవిగా..

మహాశక్తి మంత్రం.. లలితా సహస్రం



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



యాగం వేదికపై వారాహి అమ్మవారికి హారతి ఇస్తున్న స్వామీజీ

కాకినాడ రూరల్: అనేక శక్తులతో కూడిన మహామంత్రం లలితా సహస్ర నామమని కాకినాడ శ్రీపీఠం అధిపతి పరిపూర్ణానంద స్వామి అన్నారు. రమణయ్యపేటలోని శ్రీపీఠంలో మహాశక్తి యాగం మూడో సంవత్సరం వంద కోట్ల కుంకుమార్చనల క్రతువు శనివారం ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా మంగళ చండీ, రాజరాజేశ్వరి హోమాలను వేద పండితులు నిర్వహించారు. ఐశ్వర్యాంబిక అమ్మవారు సాయంత్రం రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామీజీ అనుగ్రహ భాషణం చేస్తూ, నాలుగు వేదాలు, ఆరు శాస్త్రాలు, అష్టాదశ పురాణాలు, ఉప పురాణాలు, రామాయణ, భారత, భాగవత, సాహిత్య, కావ్య, నాటక, అలంకారాలు, షట్ శాస్త్రాలు, షడాగమాల వంటి అన్నింటి సారం లలితా సహస్రంలో ఇమిడి ఉందని వివరించారు. తిథుల్లో ప్రభావవంతమైన, ప్రమాదకరమైన తిథి అష్టమి అని అన్నారు. అష్టమి నాడు ప్రమాదాలు రాకుండా, దాని వ్యతిరేక ప్రభావాలు మన మీద పడకుండా ఉండాలంటే అమ్మ అనుగ్రహం ఉండాలని, ఆ తిథి రోజున అమ్మను ఆరాధించాలని సూచించారు. శ్రీపీఠంలో అష్టమి రోజున బగళాముఖి హోమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సుందర చైతన్యానంద స్వామి, పెరంబదూర్ సూరిబాబు కూడా పాల్గొన్నారు.